క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



పారంపేట ఆర్‌బీకేలో ఈ-క్రాప్ బుకింగ్ వివరాలు సేకరిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఏవో జి.మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. పారంపేట, ఉనుకూరు తదితర గ్రామాల్లోని రైతులతో మాట్లాడిన ఆయన ఈ–క్రాప్ నమోదు అందరూ చేసుకోవాలని సూచించారు. ఈ–క్రాప్ చేసుకున్న వారికి ఆర్‌బీకేల వద్ద పంటను సులభంగా విక్రయించుకునే వీలుండడంతో పాటు పంట నష్టపోయినప్పుడు పరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



పెనుబాకలో నిర్వహించిన ర్యాలీలో జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ బండి నర్సింహులు మాట్లాడుతూ నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని, నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నామని ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. మనం చనిపోయినా మన నేత్రాలు ఈ ప్రపంచాన్ని చూడాలని, పలువురు అంధులకు చూపును ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బోడమ్మ, సామాజిక కార్యకర్త బి. రంగనాథం, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ దేవమణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–5లో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి కార్యక్రమానికి హాజరైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిరోజూ పాలు, గుడ్లు, ఆకుకూరలు, కాయగూరలు, పప్పుదినుసులతో కూడిన ఆహారం తీసుకోవాలని, ఇలా చేస్తే రక్తహీనత, ఇతర రోగాల బారినపడకుండా ఆరోగ్యవంతులుగా ఉంటామని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు

వంగర: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు అందజేస్తున్నామన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి, సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ జి.పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

12 మంది ఆందోళనకారుల అరెస్ట్

బొబ్బిలి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టయిన నేపథ్యంలో స్థానిక కోట, ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నేతలు శనివారం ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినకుండా పోలీసుల ఆదేశాలు సైతం బేఖాతరు చేస్తూ, ముందుకు దూసుకుపోవడం గమనార్హం. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుతో పాటు, ఆ పార్టీ ఇన్‌చార్జ్ బేబి నాయన సహా 12 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. టీడీపీ నిరసనల కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు.

● గోకులకృష్ణ.. గోపాలకృష్ణ..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా రాజాం మండలంలోని బొద్దాం గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహంతో శనివారం తిరువీధి నిర్వహించారు. నాలుగు రోజుల పాటు విశేష పూజలతో పాటు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రవచన కార్యక్రమాల అనంతరం బాజాభజంత్రీలు, కోలాట ప్రదర్శనల నడుమ ఎంతో అట్టహాసంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఆబాలగోపాలం ఆలపించిన గోకులకృష్ణ..గోపాల కృష్ణ గీతంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

-రాజాం



● సమగ్ర సస్యరక్షణ



పర్యావరణ సమతుల్యత, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులే లక్ష్యంగా రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలకు సిద్ధమయ్యారు. పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణతో పాటు పంటకు మేలు చేసే పురుగులను రక్షించడమే సస్యరక్షణ ప్రధాన ఉద్దేశ్యం. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో రైతు భరోసా కేంద్రాల పరిధిలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఉనుకూరులోని అన్నదాతలు శనివారం ఇలా వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టారు.

-రేగిడి

● బతుకుబండి.. చదువుకు సాయమండి..

ప్రైవేట్ పాఠశాలల్లో చదివే చిన్నారులు ఆటోల్లో, బస్సుల్లో పాఠశాలకు వెళ్తున్న రోజులివి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలలు ప్రతిరోజూ నడిచి, పాఠశాలకు వెళ్లడం చూసిన ఓ రిక్షా కార్మికుడు తనవంతు సాయమందిస్తూ వారి చదువుకు తోడ్పాటునందిస్తున్నాడు. నిత్యం ఇలా వారిని రాజాం అమ్మవారి కాలనీ నుంచి 2 కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులను తీసుకువస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాడు.

-రాజాం సిటీ



రాజీయే రాజమార్గం

● జాతీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



రాజాం సిటీ: లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: రాజీయే రాజమార్గమని, లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ తీర్పే అంతిమమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదాలత్‌లో అన్నిరకాల సివిల్ కేసులతో పాటు రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులను కూడా ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు కూడా వాపసు పొందవచ్చన్నారు. ప్రతీ చిన్న విషయానికి గొడవలు పడి కేసులు, కోర్టుల చుట్టూ తిరగవద్దని తెలిపారు.

610 కేసుల పరిష్కారం..

ప్రస్తుతం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 610 కేసులను సీనియర్ సివిల్ జడ్జి సమక్షంలో పరిష్కరించారు. వీటిలో 12 సివిల్ కేసులు, 570 క్రిమినల్ కేసులు, భార్యాభర్తల తగాదాలకు సంబంధించి, 7 కేసులు, భూసేకరణకు సంబంధించి ఒకటి, బీఎస్ఎన్ఎల్ ప్రీ–లిటిగేషన్ కేసులు 20 ఉన్నాయి. ఈ కేసులకు సంబంధించి, రూ.48,16,964 అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రమణమూర్తి, ఉపాధ్యక్షుడు డి.భవానీప్రసాద్, ఏపీపీ కిమిడి సూర్యకుమార్, రాజాం, సంతకవిటి, రేగిడి పోలీసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

2,437 కేసుల పరిష్కారం..



బొబ్బిలి: మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవన్

బొబ్బిలి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 2,437 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్ కేసులు–22, చెక్‌బౌన్స్ కేసులు–4, మెయింటెనెన్స్ కేసులు–2, పిలుపుదావా కేసులు–2, సీసీ కేసులు–91, ఇతర క్రిమినల్ కేసులు–2,316 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎం.సరోజనమ్మ, జె.సామ్యూజోసెఫిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డు గ్రహీతకు సన్మానం



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో ఎం.ఎస్.స్వామినాథన్ అవార్డ గ్రహీత, రైతు సాధికారత సంస్థ, ప్రకృతి వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌ను బొబ్బిలి వీణ, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు ఆయన చేస్తున్న కృషిని వక్తలు కొనియాడారు. అంతకుముందు ఆయన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ప్రతీ రైతు ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేడీ కె.టి.రామారావు, ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీవో హేమసుందర్, డీపీఎం ఆనందరావు, బొబ్బిలి ఏడీ ఎం.శ్యామసుందర్, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవరావు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, వీఏఏ రాజశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వాండ్రాసి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రోగుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్



రేగిడి: ఉప్పర్నాయుడువలసలో ఆయుర్వేద వైద్యశిబిరంలో వైద్యాధికారి సునీల్‌కుమార్



రేగిడి: చిన్నారికి వైద్యసేవలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రామభద్రపురం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్ అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో శనివారం వైద్యశిబిరం నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందన్నారు. ఈ నెల 15వ తేదీన వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలను కలిసి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, ఏఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారన్నారు. 16వ తేదీ నుంచి వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి, వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస గ్రామాల్లో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు ఎస్.సునీల్‌కుమార్ పలువురికి వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. చాలామంది కీళ్లనొప్పులు, వాతనొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మవ్యాధులతో బాధపడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, వారికి ఆరోగ్య సూత్రాలు తెలియజేయడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చామని వైద్యుడు తెలిపారు.

రేగిడి: మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు శనివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇచ్చి, ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగు, ఈ-క్రాప్ నమోదుపై ఎమ్మెల్యే ఆరా



సూచనలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: ఈ–క్రాప్ నమోదులో జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాజాం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోనారి అప్పారావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని, నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు, ఈ–క్రాప్ నమోదు వివరాలపై ఆరాతీశారు. ప్రతీ రైతు భరోసా కేంద్రంలో నెలకోసారి రైతులతో సమావేశాలు నిర్వహించి, సాగు, ఈకేవైసీ, ఈ–క్రాప్ నమోదు, రుణాలు వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయించడంతో పాటు పంటలకు వచ్చే పలు రకాల చీడపీడలను వివరించి, రైతులను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదులో పంటల వివరాల్లో తప్పులు దొర్లకుండా చూడాలని, రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలన్నారు. రైతులు అన్ని విధాలా ఆర్థికంగా బలోపేతమయ్యేలా దృష్టిసారించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యతపై అన్నదాతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో రేణుకాసాయి, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని, ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని జల్ జీవన్ మిషన్ రాజాం సబ్‌డివిజన్ సభ్యుడు జి.సూరపునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.శ్రీచరణ్ తెలిపారు. శనివారం మండలంలోని మజ్జిరాముడుపేటలో జల్ జీవన్ మిషన్ బృంద సభ్యులు తాగునీటి వాడకంపై మహిళలకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గ్రామాల్లోని ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం నిర్మల, పంచాయతీ కార్యదర్శి ఆశాస్వాతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

మానవ, బాలల హక్కులపై అవగాహన

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాజాం, సంతకవిటి మండలాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఆర్‌సీ(హ్యూమన్ రైట్స్ క్లబ్) లీడర్ల(విద్యార్థులు)కు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో మానవ హక్కులు, బాలల హక్కులపై శనివారం అవగాహన కల్పించారు. పారా సంస్థ ఆధ్వర్యంలో ఓబీ పేరిట ఈ శిక్షణ జరిగిందని, ట్రైనింగ్ స్టేట్ కో–ఆర్డినేటర్ టి.రమేష్, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ ఎం.ఆనంద్, జిల్లా కో–ఆర్డినేటర్ ఎల్.సంపత్‌కుమారి, టీమ్ మెంబర్లు ఎస్.కల్యాణి, గైడ్ టీచర్లతో పాటు 16 పాఠశాలలకు చెందిన 75 మంది హెచ్ఆర్‌సీ లీడర్లు పాల్గొన్నారని ఎంపీడీవో ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంట్యాడ: మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానిక ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం గంట్యాడకు చెందిన రాళ్లపూడి ఎర్రినాయుడు ద్విచక్రవాహనంపై కొర్లాం వైపు వెళుతుండగా ధర్మవరం నుంచి విజయనగరం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎర్రి నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందజేశారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
● వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కలిగిన మేలును, చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కొత్తవలసలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో కొత్తవలస మండలస్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని ఆపార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమా లను ప్రజలకు వివరించేందుకు, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు క్షేత్రస్థాయిలో బలంగా పనిచేయాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, కరోనా వంటి రుగ్మతలు వచ్చినా ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలుచేస్తూ, పేదల సంక్షేమమే అజెండాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాలుగేళ్లలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, పేదల పక్షపాతిగా ముద్రపడ్డారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామవలంటీర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి మళ్లీ జగన్ సీఎం అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, ఏపీ వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో పోర్టులను అభివృద్ధి చేస్తూ, పరిశ్రమలు ఏర్పాటును ప్రోత్సాహిస్తూ భావితరాలకు ఉపాధి కల్పనకు సీఎం పెద్దఎత్తున ప్రణాళిక అమలుచేస్తున్నారన్నారు. విశాఖపట్నాన్ని రాజధానిగా అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్రలో విద్య ఉపాధి కలుగుతుందన్నారు. ఎంపీపీ ఎన్.గోపెమ్మ, జెడ్పీటీసీ ఎస్.శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు, నాయకులు మేలాస్త్రి అప్పారావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, లెంక రామన్నపాత్రుడు, గొరపల్లి రవి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్‌కుమార్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గడసాం విద్యార్థిని



విద్యార్థిని మల్లేశ్వరితో వ్యాయామ ఉపాధ్యాయుడు

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు గడసాం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని బి.మల్లేశ్వరి ఎంపికయ్యారు. ఆపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రం విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–16 విభాగం 2 వేల మీటర్ల పరుగు పందెంలో మల్లేశ్వరి ద్వితీయ స్థానం సాధించిందని చెప్పారు. ఏలూరులో ఈనెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరపున ఈ విద్యార్థినిని పాల్గొననున్నారు. విద్యార్థినిని సర్పంచ్ నేతేటి దీపిక, హెచ్ఎం రామ్మూర్తి అభినందించారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఎస్ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాలు.. నరవ గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంమేరకు దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురును అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,800 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.